ప్రజాశక్తి
మంగళవారం 16 సెప్టెంబర్ 2025 5
శ్రీ సత్యసాయి



రాష్ట్ర సదస్సులో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

రాష్ట్ర సచివాలయంలోని ఐదో బ్లాకులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్స్ సోమవారం ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి జిల్లా నుంచి కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.



విధుల్లో పోలీసుల నిర్లక్ష్యం..!

◆ 'పురం' నియోజక వర్గంలో పెరిగిన క్రైం రేట్....!! ◆ కొత్త బాస్ రాకతో పెండింగ్ కేసులు కొలిక్కి వచ్చేనా,...?

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం సబ్ డివిజన్ వ్యాప్తంగా పోలీసులు వారి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో క్రైం రేట్ ఆమాంతంగా పెరుగుతోంది. గడచిన ఏడాది కాలంగా చూసుకుంటే జిల్లాలో హిందూపురం నియోజకవర్గంలో పలు హత్యలు, దారిదోపిడీలు, ఇంటి దోపిడీలు పదుల సంఖ్యలో జరిగాయి. వాటిని అరికట్టడంలో రక్షక భటులు అంతంతమాత్రంగానే పనిచేశారన్న ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. హిందూపురం నియోజకవర్గ శాంతి భద్రతల విషయంలో లోకల్ పోలీసుల దృష్టి తక్కువగా ఉందనిచెప్పడానికి ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు ఉదాహరణగా తీసుకోవచ్చు. చిలమత్తూరులో అత్తా కోడలుపై గ్యాంగ్ రేప్ తో మొదలుకొని గత నెలలో తూముకుంట పారిశ్రామిక వాడలో జరిగిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ చోరీ వరకు పదుల సంఖ్యలో జరిగిన కేసుల్లో కొన్ని పోలీసులకు సవాల్‌గా మిగిలాయి. వెంకటాద్రి లేఅవుట్ లో ఒక రియాల్టర్ ఇంటిలో సినీ పక్కీలో దుండగులు ఇంటిలోకి ప్రవేశించి కుటుంబ సభ్యులను తాడులతో కట్టివేసి బంగారం దోచుకెళ్లారు. ఈ కేసులో రాబడి రికవరీ చేసి కేవలం ఒక నిందితుడిని అరెస్టు చేశారు. మరి కొంతమందిని పరారీలో ఉన్నట్లు చూపించారు. లేపాక్షి మండలంలో వివాహేతర సంబంధం కారణంగా జరిగిన దారుణ హత్య కలకలం రేపింది. తల మొండెంను వేరుచేసి పడేశారు. ఈ కేసును నీరు గారిచ్చినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. మరో పక్క ఒకే రోజు మూడు చోట్ల పెద్ద ఎత్తున ఇంటి దోపిడీలు జరిగాయి. ఇకపోతే తూముకుంట పారిశ్రామిక వాడలో ఎస్‌బిఐలో ఏకంగా రూ. 12 కోట్లు విలువచేసే బంగారం, రూ. 38 లక్షల నగదు దోచుకు వెళ్లారు. ఈ కేసులో కేవలం రెండు కేజీల బంగారం రికవరీ చేసి ఒక నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ పంపించారు. మరొక నిందితుడు పరారీలో ఉన్నట్లు మీడియా సమావేశంలో జిల్లా ఎస్పి వివరించారు. మరో పక్క హిందూపురంలో గంజాయిని అరికట్టడంలో కనీసం అవగాహన కార్యక్రమం కల్పించడంలో కూడా పూర్తిస్థాయిలో స్థానిక పోలీసులు విఫలం అయ్యారని చెప్పవచ్చు. గంజాయి విక్రేతలతో కొంతమంది పోలీసులకు సంబంధాలు బాగా ఉన్నట్లు పెద్ద ఎత్తున పట్టణంలో ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంత మంది సిబ్బందికి బదిలీలు వచ్చినప్పటికీ ఇక్కడే పాతుకుపోవటంతో నేరచరిత్ర కలిగిన వారితో వీరికి సంబంధాలు ఉన్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. కొంత మంది సిబ్బందిని కూడా గతంలో పనిచేసిన ఎస్పి వివరాలు సేకరించి మరోచోటికి బదిలీలు చేసినప్పటికీ డిప్యూటేషన్‌పై తిరిగి హిందూపురం నియోజకవర్గంలో చేరారు. హిందూపురంలో జరుగుతున్న దోపిడీల గురించి పాత నేరస్తులపైన అనుమానాలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో వారికి పోలీస్ కిందిస్థాయి సిబ్బంది సహకారం పూర్తిస్థాయిలో ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈనేపథ్యంలో జిల్లా నూతన ఎస్పిగా సత్యకుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కొత్త బాస్ హిందూపురంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు పెండింగ్ కేసులను పరిష్కరించడంలో శ్రద్ధ తీసుకుని క్రైమ్ రేట్ తగ్గించడానికి ఏలాంటి చర్యలు తీసుకొంటారో వేచి చూడాలి.



2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలి

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి

ప్రజాశక్తి-మడకశిర రూరల్

2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలని ఏపి రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులకు ఉద్యోగ, ఉపాధి కల్పిస్తామని చెప్పి మండలంలోని సి.కొడిగేపల్లి, కేతేపల్లి, కల్లుమర్రి, నల్లనాయనపల్లిలో రైతుల నుంచి భూములను సేకరించి 20 ఏళ్ల గడుస్తున్నా పరిశ్రమలు స్థాపించలేదని మండిపడ్డారు. దీంతో పరిశ్రమల పేరుతో సేకరించిన భూములను రైతులకు తిరిగి వెనక్కి ఇవ్వాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలని, రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకాన్ని వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో అంగాలపల్లి పెద్దన్న, సిఆర్.రెడ్డి, రమేష్, యోగానంద్, కొల్లారప్ప, వెంకటరమణప్ప, రామంజి, ప్రవీణ్‌కుమార్, నారాయణప్ప, ముత్యాలప్ప, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

రూ. 7.5 లక్షల నగదు, కారు స్వాధీనం

ప్రజాశక్తి-గోరంట్ల

అంతర్రాష్ట్ర ఆరుగురు దొంగల ముఠాను అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 7.5 లక్షల నగదు, ఓ కారు స్వాధీ నం చేసుకున్నట్లు డీఎస్పీ నర్సింగప్ప తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం డీఎస్పీ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 3వ తేదీ మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన భుజంగరావు స్థానిక ఎస్‌బిఐలో రూ. 3.8 లక్షల నగదు డ్రా చేసుకొని అక్కడి నుంచి ద్విచక్ర వాహంపై పిఎస్ వస్త్ర దుకాణం వద్దకు వెళ్లారు. నగదును ద్విచక్ర వాహనం సైడ్ బ్యాగులో ఉంచి దుస్తులు కొనుగోలు చేసేందుకు దుకాణంలోకి వెళ్లాడు. అతడిని అనుసరించిన మధ్యప్రదేశ్‌కు చెందిన మహిళా దొంగలు కారులో వచ్చి ద్విచక్ర వాహనం బ్యాగులో ఉంచిన రూ. 3.8 లక్షలు ఎత్తుకెళ్లారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అందిన సమాచారం మేరకు పోలీసులు ఈ నెల 14వ తేదీ మండలం లోని పాలసముద్రం గ్రామం వద్ద అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు చెందిన దీపమాల బాయ్, పరిత, ప్రదీప్ సిసోడియా, రేఖాబాయ్, మలబాయ్‌లను అరెస్ట్ చేసి రూ. 7.5 లక్షల నగదు, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. దొంగల ముఠాను మధ్యప్రదేశ్‌కు చెందిన వారిగా గుర్తించారు. ఈ ముఠా గత నెల 21 నుంచి ఈ నెల 3వ తేదీ వరకూ నంద్యాలలో-1, తెలంగాణలో-3, కడపలో-3, కర్నాటకలో -1, ఒడిశాలో-1, గోరంట్లలో చోరీలకు పాల్పడ్డారన్నారు. ఈ ముఠా బ్యాంకుల వద్ద ఎక్కువ మొత్తంలో డ్రా చేసే వారిని లక్ష్యంగా చేసుకొని నగదు చోరీలకు పాల్పడేవారని తెలిపారు. దొంగల ముఠాను అరెస్ట్ చేసిన సీఐ శేఖర్, ఎస్ఐ రామచంద్రయ్య, సిబ్బంది కృషిని కొనియాడారు. దొంగల ముఠా సభ్యులను పెనుకొండ కోర్టులో హాజరపరిచినట్లు డీఎస్పీ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న నగదు, కారును చూపిస్తున్న పోలీసులు

అంగన్వాడీలకు కనీస వేతనం చెల్లించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి

ప్రజాశక్తి-సోమందేపల్లి

అంగన్వాడీ వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని, మూడు, నాల్గో తరగతి ఉద్యోగాలుగా గుర్తించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సిఎస్.శ్రీదేవి డిమాండ్ చేశారు. స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో మినీ అంగన్వాడీ వర్కర్ల విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టి సంబరాలు చేసుకున్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఈఎస్.వెంకటేష్, సిఎస్.శ్రీదేవి మాట్లాడుతూ పోరాటాల ఫలితంగానే 5,126 మంది మినీ వర్కర్లలో 4,687 మందిని మెయిన్ వర్కర్లుగా గుర్తించారన్నారు. మిగిలిన వారిని కూడా మెయిన్ వర్కర్లుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. అంగన్వాడీ వర్కర్లకు కనీస వేతనం రూ. 26,800, హెల్పర్లకు రూ. 20,300 అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20, 21 తేదీల్లో ఒంగోలులో నిర్వహించే రాష్ట్ర మహాసభల్లో కర్తవ్యాలను రూపొందించి, రాబోయే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేలా సిఐటియు కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కోశాధికారి పద్మావతి, సెక్టార్ లీడర్స్ నాగరత్న, ప్రమీల, అనురాధ, సావిత్రమ్మ, సోమందేపల్లి సెక్టార్ మెయిన్ వర్కర్స్, మినీ వర్కర్స్ పాల్గొన్నారు.

అంగన్వాడీల సంబరాలు

గుడిబండ : ప్రభుత్వం మినీ అంగన్వాడీలను మెయిన్ అంగన్వాడీలుగా మార్చడంతో గుడిబండ ప్రాజెక్ట్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ముందు సిఐటియు జిల్లా కార్యదర్శి శ్రీదేవి, ఉషారాణి, ఐసిడిఎస్ మండల అధ్యక్షురాలు నాగమణి, కార్యదర్శి మహాదేవమ్మ, కోశాధికారి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో సిబ్బంది కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగులు మృతి చెందితే మట్టి ఖర్చులకు రూ. 15వేలు, ఏడాదిలో ఒక నెల పూర్తిగా వేసవి సెలవులు, గ్రాట్యుటీ, ఈ ప్రాజెక్ట్ పరిధిలో 19 మంది మినీ అంగన్వాడీ కార్యకర్తలను మెయిన్ కార్యకర్తలుగా ఉద్యోగోన్నతి కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇవన్నీ సిఐటియు పోరాటాల ఫలితమే అన్నారు. కార్యక్రమంలో సిడిపిఒ రహమ్మతీయ, సూపర్వైజర్ కమలమ్మ, ఆర్‌డిటి సంస్థ ఎటిఎల్ మీనాక్షి, సెక్టార్ల ప్రతినిధులు బీమాబాయి, సుజాత, దేవీరమ్మ, తిప్పమ్మ, నాగరత్న, నాగవేణి, నాగరత్న, మినీలీడర్ కల్పన, తదితరులు పాల్గొన్నారు.



సోమందేపల్లి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న అంగన్వాడీ ఉద్యోగులు

చేనేత కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-సోమందేపల్లి

చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాలని కోరుతూ సోమవారం ఎపి చేనేత కార్మిక సంఘ జిల్లా నాయకులు శీలా నారాయణస్వామి ఆధ్వర్యంలో సోమవారం డిప్యూటీ తహశీల్దార్ రెడ్డిశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సిఎం చంద్రబాబు చేనేతలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రకటించారని ఆ మేరకు అమలు చేయాలని కోరారు. చేనేత పింఛను, పరికరాలు, వర్క్‌షెడ్ల కోసం దరఖాస్తు చేసుకొన్న వారందరికీ వాటిని మంజూరు చేయాలని కోరారు. సోమందేపల్లిలో నూతనంగా ఏర్పాటయ్యే క్లస్టర్‌లో చేనేత కార్మికులకు న్యాయం చేయాలన్నారు. చేనేత భరోసా రూ. 25వేలు ప్రతి చేనేత కార్మికునికి అందించాలని కోరారు. కార్యక్రమంలో దాసరి సుధాకర్, శ్రీనివాసులు, ఈశ్వర్, బెస్త కిష్టప్ప, కుమ్మర కిష్టప్ప, ఈడిగ నాగరాజు, వడ్డీ నాగరాజు, పామిశెట్టి మల్లికార్జున, బెస్త వెంకటేశ్వర్లు, కాశీం, చేనేత కార్మికులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహశీల్దార్ రెడ్డిశేఖర్‌కు వినతి పత్రం ఇస్తున్న చేనేత కార్మికులు

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

కదిరి టౌన్ : నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 33 మందికి రూ.29.82లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. సోమవారం పట్టణంలోని రోడ్లు భవనాలు అతిథి గృహంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు.

హరీష్ స్కూల్లో హిందీ దినోత్సవం

కదిరి టౌన్ : హరీష్ పాఠశాలలో సోమవారం జాతీయ హిందీ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎంఎస్. కిరణ్ జ్యోతి మాట్లాడుతూ హిందీ భాషను నేర్చుకోవడం ద్వారా దేశంలో ఎక్కడైనా ఉద్యోగం సాధించే వీలుంటుందన్నారు. విద్యార్థులు హిందీ భాషపై పట్టు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాదుల్లా, ప్రకాశం, ఆశ బేగం, రంగనాయకమ్మ, అఫ్రషున్నీసా విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రిపై అనుచిత విమర్శలను సహించం

ప్రజాశక్తి-పెనుకొండ

మంత్రి ఎస్.సవితపై అనుచిత విమర్శలు చేస్తే సహించమని టిడిపి సీనియర్ నాయకులు కృష్ణమూర్తి మండిపడ్డారు. పెనుకొండ మెడికల్ కళాశాల విషయంలో వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ మంత్రి సవితపై అనుచిత విమర్శలు చేయడంపై సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో తీవ్రంగా మండిపడ్డారు. నియోజకవర్గంలో మంత్రికి లభిస్తున్న ప్రజాదరణ, అభిమానం గురించి తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. మంత్రిని హాఫ్ నాలెడ్జ్ అంటూ విమర్శలు చేసే ముందు మీ నాలెడ్జ్ ఏ పాటిదో ఒకసారి తెలుసుకోవాలన్నారు. బెంగళూరు నుంచి రోజూ అప్ అండ్ డౌన్ చేసుకుంటూ ఫొటోలకు ఫోజులిస్తూ సోషల్ మీడియాలో పాపులర్ చేసుకునే సంస్కృతి మీది అన్నారు. మీ సైకో ప్రభుత్వంలో అన్న క్యాంటీన్లు మూసేస్తే సొంత నిధులతో రూ.5కే భోజనం పెట్టిన అన్నపూర్ణేశ్వరి సవిత అన్నారు. నియోజకవర్గంలో ఎంతోమంది గర్భిణులకు పౌష్టికాహారం, కిట్లు ఇచ్చిన గొప్ప వ్యక్తి అన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయంగా మీ ఎదుగుదలకు దోహదపడిన కార్యకర్తలు, మండల నాయకులను సైతం అక్రమ కేసుల్లో ఇరికించిన చరిత్ర మీది అన్నారు. ఇకపై మంత్రి సవితపై అవాకులు చవాకులు పేలితే ఖబర్దార్ అని హెచ్చరించారు.



కృష్ణమూర్తి

విద్యతోనే సమాజాభివృద్ధి

హిందూపురం : విద్య ద్వారానే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందని పద్మశ్రీ అవార్డు గ్రహీత, చాణిక్య యూనివర్సిటీ వ్యవస్థాపకులు ఛాన్సెలర్, న్యూ నేషనల్ ఎడ్యుకేషన్ రిఫార్మ్‌సీ సభ్యులు యం. కె. శ్రీధర్ పేర్కొన్నారు. స్థానిక సరస్వతీ విద్యా మందిరంలో సోమవారం ఆయన జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. సహచర ఉద్యోగులు, స్నేహితులు, విద్యార్థులు వేడుకల్లో పాల్గొని విద్యాభివృద్ధి కోసం శ్రీధర్ చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సరస్వతీ విద్యా మందిరం రాయలసీమ కార్యదర్శి రాధాకృష్ణ, శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శి పరమేశ్వర, బెంగళూరుకు చెందిన వాణిజ్య అల్యూమిని అధ్యక్షులు విజయ, జగదీష్, నారాయణ పాల్గొన్నారు.

షరతులు లేకుండా యూరియా అందించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఎలాంటి షరతులు లేకుండా రైతులకు అవసరం అయిన యూరియాను సరఫరా చేయాలని జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు జి. సజ్జా రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో పలువురు రైతులు కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. అనంతరం ఇన్‌ఛార్జి డిఆర్‌ఒకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా లో పలు గ్రామాలలో రైతులు వరి నాట్లు వేశారన్నారు. అకాల వర్షాలు వల్ల వేసిన నాట్లు నిలదొక్కుకోవాలంటే తక్షణం యూరియా అవసరం అన్నారు. ఒక రైతుకు ఒక బస్తా అనే షరతు తొలగించి ఎంత అవసరముంటే అంత యూరియా సరఫరా చేయాలన్నారు. సహకార సంఘాల ద్వారా సక్రమంగా యూరియా ఇవ్వడంలేదన్నారు. బ్లాక్ లో అమ్మకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. బ్లాక్ మార్కెట్ ను అరికట్టి వెంటనే రైతులను ఆదుకోవాలని లేని పక్షంలో కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో లో కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు.



కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

'మోక్షగుండం'కు నివాళి

మడకశిర రూరల్ : మండలంలోని టిడి.పల్లి ప్రభుత్వ పాఠశాలలో సోమవారం హెచ్ ఎం భూతన్న అధ్యక్షతన ఇంజినీర్స్ డే ఘనంగా నిర్వహించారు. ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితం, ఇంజినీర్స్ డే ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిపి రవీంద్ర, రామకృష్ణ, పరమేశ్వర్, రఘురాంరావు, సరిత, చైతన్య, కమిటీ సభ్యులు, విద్యార్థులు, పాల్గొన్నారు.



విశ్వేశ్వ రయ్యకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



యానిమేటర్లకు బయోమెట్రిక్ డివైజ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు రాజు, దస్తగిరి

యానిమేటర్లకు బయోమెట్రిక్ డివైజ్‌లు పంపిణీ

మడకశిర టౌన్ : నియోజకవర్గ వ్యాప్తంగా వెలుగు సంస్థలో పని చేస్తున్న 270 మంది విఒఎ యానిమేటర్లకు సోమవారం ఎమ్మెల్యే ఎంఎస్.రాజు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరితో కలిసి బయోమెట్రిక్ డివైజ్‌లను అందజేశారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసిన ఈ డివైజ్‌లను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని, నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, వెలుగు అధికారులు జడ్పిటిసి ఉమేష్, నరసింహమూర్తి, మండల కన్వీనర్లు ఈరన్న, లక్ష్మీనరసప్ప, కృష్ణమూర్తి, తిప్పేస్వామి, సింగిల్‌విండో అధ్యక్షులు దాసిరెడ్డి, కుమార్‌స్వామి పాల్గొన్నారు.

ఎంజెపి పాఠశాలకు వితరణ

లేపాక్షి : స్థానిక మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాలకు సోమవారం టిడిపి నాయకులు రూ. 45 వేలు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు విద్యార్థుల భద్రత దృష్ట్యా పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ప్రిన్సిపల్ సుందర్‌రాజ్‌కు రూ. 45వేలు అందజేశామన్నారు. రాబోయే రోజుల్లో పాఠశాలకు మరింత సాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ అభిలాష్, రాష్ట్ర టూరిజం శాఖ డైరెక్టర్ జయప్ప, నాయకులు ఆనంద్ కుమార్, వెచ్చం సుబ్రమణ్యం, కోడిపల్లి నాగరాజు, స్కూల్ కమిటీ ఛైర్మన్ షఫీవుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ప్రసవాలు పిహెచ్‌సిల్లోనే జరగాలి : డిఎంహెచ్‌ఒ

మడకశిర టౌన్ : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, కాన్పులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరిగేలా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్‌ఒ ఫిరోజ్‌బేగం ఆదేశాంరు. పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో సోమవారం నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కాన్పులు పిహెచ్‌సిలోనే జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. మలేరియా నివారణ అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దోమల వల్ల వచ్చే వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఒ మంజువాణి, మడకశిర మలేరియా సబ్ యూనిట్ అధికారి షమీఉల్లా, డాక్టర్లు నరేష్‌కుమార్, శ్రీనివాసనాయక్, శివానంద్, అసిస్టెంట్ మలేరియా అధికారి లక్ష్మీనాయక్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

గుడిబండ : మండలంలోని మద్దనకుంట, కొంకల్లు రైతు సేవా కేంద్రాలోల సోమవారం రైతులకు యూరి యా పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి వీరనరేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ జంబులబండ, దేవరహట్టి రైతు సేవ కేంద్రాలకు మరో రెండు రోజుల్లో యూరియా, ఇతర ఎరువులు తెప్పించి పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం అధికారులు అపర్ణ, రంగనాథ్ పాల్గొన్నారు.

రాష్ట్ర పర్యాటక శాఖ డైరెక్టర్‌కు సన్మానం

లేపాక్షి : రాష్ట్ర పర్యాటక శాఖ డైరెక్టర్‌గా నియమితులైన జయప్పను సోమవారం టిడిపి నాయకులు, అధికారులు, ప్రజలు ఘనంగా సన్మానించారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమం లో ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి ప్రజలకు పంచి పెట్టారు. అనంతరం జయప్పను ఘనంగా సన్మానించారు. జయప్ప మాట్లాడుతూ పర్యాటక శాఖ, లేపాక్షి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ పదవి రావడానికి సహకారం అందించిన ఎమ్మెల్యే బాలకృష్ణ, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ అభిలాష్, నాయకులు ఆనంద్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.



జయప్పను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

బాలల హక్కులపై అవగాహన

లేపాక్షి : మండలంలోని సిరివరం జడ్పీ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు సూపర్వైజర్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో పౌష్టికాహారం, బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిడిపిఒ వరలక్ష్మి మాట్లాడుతూ సమతుల్యంగా ఆహారం తీసుకున్నప్పుడు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అలాగే శక్తి యాప్, బాలల హక్కులు, బాల్య వివాహాలు, పోక్సో చట్టం, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, హెల్ప్ లైన్ నెంబర్స్ 100, 112, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధా నోపాధ్యాయులు శ్రీనాథ్ విద్య ఆవశ్యకత, చెడు వ్యసనాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ గంగాధర్, శక్తి టీం సభ్యులు లింగమూర్తి, చైత్ర, సఖి సెంటర్ సిబ్బంది ఉమాదేవి, జిల్లా బాలల సంరక్షణ విభాగం కౌన్సిలర్ శివలత, సచివాలయం మహిళా పోలీసులు శ్రీలక్ష్మి, శిరీష, అంగన్వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

రొద్దం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమావేశం 12:30కు ముగిసింది. ఇందులో ఎలాంటి సమస్యలు కానీ, జరగబోయే అభివృద్ధి కార్యక్రమాలపై కానీ చర్చలు జరగలేదు. అయితే కొన్ని శాఖల అధికారులు మాత్రం జరిగిన విషయాలు, జరగబోయే కార్యక్రమాల గురించి తెలిపారు. జడ్పిటిసి సభ్యులు పద్మఅక్కులప్ప రొద్దంలో ప్రధాన రహదారిలో మహిళల మరుగుదొడ్ల సమస్యలను ప్రస్తావించగా టిడిపి నాయకులు వివరణ ఇచ్చారు. సమావేశంలో ఎంపిపి, జడ్పిటిసి, పెనుకొండ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ రామకృష్ణ, సింగిల్‌విండో అధ్యక్షులు నీరుగంటి వీరాంజనేయులు, రామచంద్రప్ప, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు, సభ్యులు



పని ఒత్తిడి తగ్గించాలి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

తమకు పని ఒత్తిడి తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు అధికారులను కోరారు. ఈ మేరకు వారు సోమవారం ఎంపిడివో పార్థసారధికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐవిఆరెస్,స్వమిత్ర సర్వే వివిధ పనుల భారం వలన ఉద్యోగం చేయలేకపోతున్నామని వాపోయారు. వివిధ రకాల సర్వేల పేరుతో అధిక పని భారాన్ని మోస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ రాజ్ శాఖ కేటాయించిన పలు సర్వేలు, గణాంక సేకరణలతో తమపై అదనపు భారం పడుతుందని వారు పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో అసలు ప్రజా సేవలకు, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు సమయం దొరకడం లేదని అన్నారు. సర్వేల బాధ్యతల నుండి తమకు విముక్తి కల్పించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవులకు దరఖాస్తులు సమర్పించారు. అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని, లేదంటే తాము మరింత ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి - నల్లచెరువు

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ప్రమోషన్లపై ఇతర ప్రాంతాలకు వెళుతున్న ఎంపీడీవో రఘునాథ్ గుప్తా, ఇఒఆర్‌డి శకుంతలను ప్రజా ప్రతినిధులు అధికారులు సోమవారం సన్మానించారు. వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, సింగల్ విండో ప్రెసిడెంట్ కమ్మల వెంకటరమణ, సర్పంచులు హర్షవర్ధన్ నాయుడు, విష్ణు, పంచరత్నమ్మ, నాగరాజు, కృష్ణారెడ్డి, బేకరీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లింగప్పగారిపల్లిలో వైద్యశిబిరం

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల పరిధిలోని సిద్ధరాంపురం, లింగప్ప గారి పల్లి గ్రామాలలో వైద్యాధికారి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జ్వరాలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ఫీవర్ సర్వే నిర్వహించారు. సీజనల్ వ్యాధులైన మలేరియా డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులపై ప్రజల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుమలత, సాలమ్మ, ఓబులమ్మ, సుస్మిత, కన్వీనర్, మల్లి రెడ్డి, చంద్ర మాణిక్యం ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కుర్లి విద్యార్థులు

ప్రజాశక్తి - తలుపుల

ఉమ్మడి అనంతపురం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన అండర్14 ఫ్రీ స్టయిల్ విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కుర్లి విద్యార్థినులు దేవి,లక్ష్మీ ప్రసన్న,గౌరి ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు ప్రధానోపాధ్యాయిని విజయ భారతి తెలిపారు. వీరికి శిక్షణ నిచ్చి ప్రోత్సహించిన పిడి. సాయికృష్ణను, విద్యార్థినులను పాఠశాల ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు అభినందించారు.

ఘనంగా హిందీ భాష దినోత్సవం

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ దినోత్సవం వేడుకలు సోమవారం నిర్వహించారు. ఎంఇఒ 1 హనుమంత రెడ్డి మాట్లాడుతూ 1949లో సెప్టెంబర్ 14న రాజ్యాంగ పరిషత్ లో హిందీ భాషను జాతీయ భాషగా గుర్తించినట్లు చెప్పారు. అప్పటి నుండి హిందీ దివస్ వేడుకలు నిర్వహించుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన హిందీ నృత్య కళారూపాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులు చేసిన హిందీ ప్రాజెక్టులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, రామలక్ష్మి, రుతమ్మ, విశ్వనాథ్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, రామ్మూర్తి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణకు వీల్ బారోస్

ప్రజాశక్తి-హిందూపురం

వార్డుల్లో చెత్త సేకరణ కోసం ప్రత్యేకంగా వీల్ బారోస్ కొనుగోలు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. కొనుగోలు చేసిన సంబంధిత వీల్ బారోస్‌ను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వార్డుల పరిధిలో ఉన్న సచివాలయాలకు క్రొత్త వీల్ బారోస్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వార్డుల్లో చెత్త సేకరణకు ఈ వీల్ బారోస్ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. మున్సిపల్ పరిధిలోని 38 వార్డులలో 43 సచివాలయాలు ఉండగా ఒక్కొక్క సచివాలయానికి ఒకటి చొప్పున మొత్తం 43 వీల్ బారోస్ పంపిణీ చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దుర్గా నవీన్, అంజి, మున్సిపల్ ఇంజనీర్ దస్తగిరి, డిఇఇలు వాణి, లోకేష్, ఏఈ.లు జనార్దన్, శంకర్, రాజేంద్ర, శానిటరీ ఇన్స్‌పెక్టర్‌లు శంకర్, నిజాముద్దీన్ పాల్గొన్నారు.

అగ్రి మిషన్ స్టేట్ డైరెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

ఆంధ్ర ప్రదేశ్ అగ్రి మిషన్ డెవలప్మెంట్ స్టేట్ డైరెక్టర్ గా నియమితులైన కృష్ణమూర్తిని మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కూడలిలో ఎంఆర్‌పిఎస్ నాయకులు సన్మానించారు. తొలుత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్ నాయకులు ఇనగలూరు లక్ష్మన్న, పెద్దగుట్లపల్లి రామకృష్ణ, మామిలకుంట్లపల్లి బావన్న , డి రమణ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు రామాంజి, కిష్టప్ప తదితరులు కృష్ణమూర్తిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎర్రదొడ్డప్ప కే .ఆనంద్ నరసింహులు, కిష్ట, కొండకమర్ల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువుల విక్రయాలు



నందీశ్వర ఫర్టిలైజర్ దుకాణదారుడికి నోటీసు ఇస్తున్న ఏవో కవిత

ప్రజాశక్తి - చిలమత్తూరు

ములిగే నక్క మీద తాటికాయ పడ్డట్టుగా రైతుల దుస్థితి దయనీయంగా మారింది. గత సంవత్సరం పంటలకు గిట్టుబాటు ధర రాక అప్పుల్లో కూరుకుపోయిన రైతులు, ఈ ఏడాది వ్యవసాయానికి పెట్టుబడులు సమకూర్చుకోవడమే భారంగా మారింది. ఇప్పటికే అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకుని పంటలు సాగు చేస్తున్న రైతులు ఇప్పుడు ఎరువుల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎరువుల దుకాణ యజమానులు ప్రతి ప్యాకెట్‌పై రూ.200 నుంచి రూ.300 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. యూరియా లేకుండా పంట సాగు సాధ్యం కాదని తెలిసి, దుకాణ యజమానులు ఎంత చెబితే అంతకు రైతులు కొనాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం నిర్ణయించిన రూ.266.50 ధరకే యూరియా సంచి అమ్మాలని ఉత్తర్వులు ఉన్నా, మార్కెట్లో అదే సంచి రూ.500కి పైగా అమ్ముతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధిక ధరలకు అమ్మకాలు చేస్తే చర్యలు

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ అధికారి కవిత హెచ్చరించారు. మండల పరిధిలోని కోడూరు తోపులో నందీశ్వర ఫర్టిలైజర్ షాపును ఆమె సోమవారం తనిఖీ చేశారు. యూరియా ప్యాకెట్‌ను రూ.500కి విక్రయిస్తున్నాడని వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేసినట్లు ఆమె వెల్లడించారు. షాప్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి, ఇలాంటి అక్రమాలు పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆదర్శప్రాయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య

ప్రజాశక్తి-హిందూపురం

నేటి తరం ఇంజనీర్లకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆదర్శప్రాయుడని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. సోమవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్ డే వేడుకలను మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్, కమిషనర్ సమక్షంలో ఇంజనీర్లు మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ దస్తగిరి, డిఇఇలు వాణి, లోకేష్, ఏఈలు జనార్ధన్, శంకర్, రాజేంద్ర, ఎసిపి చంద్రమ్మ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. అదే విధంగా రూరల్ మండల పరిధిలోనిబి.ఐ.టి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఇంజనీర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ కు చెందిన ప్రముఖ మానసిక నిపుణులు, మోటివేటర్ డా. శివరామ ప్రసాద్ విద్యార్థులకు నైతిక విలువలు, విద్య ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాలప్రిన్సిపల్ రమేష్, వివిధ విభాగపు అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

జెవివి రాష్ట్ర కార్యదర్శిగా డాక్టర్ ఆదిశేషు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్



డాక్టర్ ఆదిశేషు

ఈ నెల 13,14 తేదీలలో విజయనగరంలో జరిగిన జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలో ధర్మవరం పట్టణానికి చెందిన డాక్టర్ ఆదిశేషును రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి వి. లోకేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 500 మంది ప్రతినిధులు హాజరైన ఈ మహా సభలో ప్రముఖ రాజకీయ, సామాజిక విశ్లేషకులు మేధోమథన చర్చల్లో పాల్గొన్నారన్నారు. గత కార్యక్రమాలను సమీక్షించుకుని భవిష్యత్ కార్యక్రమాల రూపకల్పన జరిగిందన్నారు . అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారన్నారు. జెవివి రాష్ట్ర కార్యదర్శిగా డాక్టర్ ఆదిశేషును ఎన్నుకున్నట్లు చెప్పారు.

యుటిఎఫ్ రణభేరిని విజయవంతం చేయండి

ప్రజాశక్తి - పరిగి

ఉద్యోగ, ఉపాధ్యాయులకు, సంబంధించిన ఆర్థిక, ఆర్థికేతర విద్యారంగా సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్లతో రాష్ట్రవ్యాప్తంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 15 వ తేదీ నుండి 19 తేది వరకు నిర్వహించే రణభేరిని విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం మహంతి పిలుపునిచ్చారు. సోమవారం పరిగి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సీనియర్ నాయకులు కృపాసత్యరాజ్, లక్ష్మీపతి,బాబా ఫక్రుద్దీన్ లతో కలిసి రణభేరికి సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 12వ పిఆర్సి ఊసేలేదని, నూతన కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నప్పటికీ ఒక్క డి.ఏ. కూడా ఇవ్వకపోగా వేలకోట్ల ఆర్థిక బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో తెలియని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు హఫీజ్ ఖాన్, సురేష్ చిత్ర, శంకరప్ప, గణేష్, శేఖర్, గంగరాజు, భాను, సరస్వతమ్మ, శ్రీదేవి, కులశేఖర్ రెడ్డి, విమలమ్మ, రిజ్వానా తదితరులు పాల్గొన్నారు



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

మహిళాభివృద్ధిలో దేశానికే ఎపి రోల్‌మోడల్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొత్తచెరువు

మహిళాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ దేశానికే రోల్‌మోడల్‌గా నిలుస్తోందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. తిరుపతిలో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ పార్లమెంటరీ మరియు శాసనసభ కమిటీల తొలి జాతీయ సదస్సులో సోమవారం ముగింపు సదస్సులో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అక్కడికి విచ్చేసిన మీడియాతో మాట్లాడారు. మహిళల సాధికారత కోసం స్థిరమైన ఆర్థిక సాధికారత ఎంతో అవసరం అన్నారు. ఈ సందర్భంగా తిరుపతి తీర్మానం ఆమోదించబడిందని చరిత్రలో ఈ జాతీయ సదస్సు మైలురాయిగా నిలిచిపోతుందని తెలిపారు. అనంతరం పలు రాష్ట్రాల మహిళా ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆ రాష్ట్రాల్లో మహిళలకు అమలవుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా కేరళ రాష్ట్ర మహిళా ప్రజాప్రతినిధులతో ప్రత్యేకంగా ఈ విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు. కేరళలో విద్యాభ్యాసం చేసి అక్కడే పుట్టి పెరిగి ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో పుట్టపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న పల్లె సింధూర రెడ్డిని వారు ప్రత్యేకంగా అభినందించారు.

ఎంపిడిఒ దురుసు వైఖరి

ప్రజాశక్తి - చిలమత్తూరు

గ్రామ, వార్డు సచివాలయాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉద్యోగులు సోమవారం విధులు బహిష్కరించి స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపేందుకు వెళ్లిన సచివాలయ ఉద్యోగులకు నిరాశ ఎదురైంది. వాలంటీర్ల పనులను తమతో చేయించడం తగదని ఉద్యోగులు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్ళగా ఎంపీడీవో రమణమూర్తి ముందుగా అప్పగించిన పనులు పూర్తి చేసి మధ్యాహ్నం రమ్మని చెప్పారు. లేకుంటే మీకు మెమోలు ఇస్తామంటూ హుకుం జారీ చేశారు. అక్కడున్న విలేకరులు వీడియో తీయగా వీడియో తీయకండంటూ విలేకరులపై ఎంపీడీవో మండిపడ్డాడు. కార్యాలయంలో వీడియోలు తీయకూడదంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. చేసేదేమీ లేక సచివాలయ ఉద్యోగులు అక్కడి నుండి వెనుదిరిగారు. అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ వాలంటీర్ల విధులను కార్యదర్శులతో చేయించడం సరైంది కాదని, నోషనల్ ఇంక్రిమెంట్లు, స్పష్టమైన జాబ్‌చార్ట్, మాతృ శాఖలో విలీనం వంటి డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఒకటిన్నర సంవత్సరంగా అదనపు పనిభారం మోపుతున్న ప్రభుత్వం పునరాలోచించాలని డిమాండ్ చేశారు.

రెవెన్యూ అధికారుల తీరుపై ఆగ్రహం



తమ సమస్యను చెబుతున్న రైతులు

ప్రజాశక్తి తాడిమర్రి

మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యంపై తెలుగుదేశం పార్టీ ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులు మండల పరిధిలోని భూ సమస్యల పరిష్కారం కోసం బాధితులు తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. కొందరు వీఆర్‌ఓలు తహశీల్దార్ పేరు చెప్పి.. దాట వేస్తుండగా తహశీల్దార్ కార్యాలయంలో కూడా సరైన సమాధానం లేకపోవడంతో పలువురు బాధితులు పరిటాల శ్రీరామ్ వద్దకు వెళ్లారు. దీనిపై పరిటాల శ్రీరామ్ ఫోన్ ద్వారా సమస్య వివరించిన పట్టించుకోకపోవడంతో సోమవారం స్థానిక తహశీల్దార్‌కార్యాలయంలో జరుగుతున్న గ్రీవెన్స్‌కు బాధితులతో కలసి వెళ్లారు. బాధితుల సమస్యలు ఎందుకు వీటిని పరిష్కరించడం లేదని అధికారులను శ్రీరామ్ ప్రశ్నించారు. సమాధానం దాట వేస్తున్న వీఆర్‌ఓలను కూడా పిలిపించారు. వారు ఒకరిపై ఒకరు చెప్పుకోవడంతో శ్రీరామ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తాతల కాలం నుండి ఉన్న భూమిని ఇతరుల పేరు మీదకి మార్చడం.. ఆస్తులను తగ్గించడం లాంటివి చేశారనిఅసలు తమ ప్రమేయం లేకుండా రికార్డులు ఎలా మారుస్తారని బాధితులు నిలదీశారు. దీనిపై తహశీల్దార్ అసలు పట్టించుకోవడం లేదని ఆయన ముందే చెప్పారు. శ్రీరామ్ మాట్లాడుతూ న్యాయమైన వాటిని కూడా పరిష్కరించడానికి నెలల తరబడి తిప్పడం సరైంది కాదని.. ఇక నుంచి ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేయడం సరైంది కాదన్నారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కూచి రాము, గోనుగుంట్ల భూషణ్, ముసుగు శ్రీనివాసులు, మద్దినేని రమణ, కొంక సాంబ, వీరకృష్ణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రసాయన మందులు తీసుకుంటేనే యూరియా

రైతులకు దుకాణదారుల షరతు

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

ఇతర మందులు తీసుకుంటేనే యూరియా ఇస్తామని ఎరువుల దుకాణాల నిర్వాహకులు రైతులకు షరతులు విధిస్తున్నారని ఆర్‌సిపి పుట్టపర్తి డివిజన్ కార్యదర్శి మున్నా, రైతు సంఘం రాష్ట్ర నాయకులు రామచంద్ర విమర్శించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ రైతులకు మందులు అదనంగా కొంటేనే యూరియా ఇస్తామని షరతులు విధించడం అన్యాయమన్నారు. ఎరువుల ధరల పట్టికను బయట పెట్టకుండా యూరియాను బ్లాక్‌లో విక్రయిస్తున్నారని ఆరోపించారు. వీటిపై ఉన్నత అధికారులు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డికి అందజేశారు.

సచివాలయ ఉద్యోగుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి - బత్తలపల్లి

తమపై అనవసరమైన భారం తొలగించాలని డిమాండ్ చేస్తూ బత్తలపల్లి మండలంలోని సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం స్థానిక ఎంపీడీవో నరసింహనాయుడుకు సోమవారం అధికారికంగా సమ్మె నోటీసు అందజేశారు. నేషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని కోరారు. డోర్ టు డోర్ సర్వే బాధ్యతల నుండి విముక్తి కల్పించాలని కోరారు. ఉద్యోగులను వాలంటీర్ విధుల నుంచి మినహాయించాలన్నారు.

ధర్మవరం రూరల్ : ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యకార్యాచరణ కమిటీ పిలుపుమేరకు సోమవారం పట్టణంలోని గ్రామ, పట్టణ సచివాలయ ఉద్యోగులు మున్సిపల్ కమిషనర్ కు సమ్మె నోటీసులు అందించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పేదల కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి : వ్యకాసం



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

పేదల కోసం మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో నిర్మించిన కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులతో కలసి సోమవారం కలెక్టరేట్ లో ఆర్డీవో సువర్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో సుమారు 3 వేల మంది పేదలకు ఒక సెంటు ప్రకారం ఇంటి పట్టాలు ఇచ్చారన్నారు. అందులో సుమారు 1500 మంది గృహాలు నిర్మించుకుని ఏడేళ్లుగా అక్కడే నివాసం ఉంటున్నారన్నారు. అయితే కాలనీకి తాగునీరు, రహదారులు, వీధి దీపాలు లేనందున కాలనీవాసులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రహదారి సరిగా లేనందున ఇటీవల తాగునీటి సరఫరా ట్యాంకర్ బోల్తాపడిందన్నారు. వీధి దీపాలు లేనందున రాత్రి సమయంలో విషపురుగులతో కాలనీవాసులు బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించకుంటే వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

బాల్యవివాహాలను నిర్మూలిద్దాం

ప్రజాశక్తి - కదిరి అర్బన్

బాల్య వివాహాలను అరికట్టడం అందరి బాధ్యత అనిరెడ్స్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ ఎల్లప్ప తెలిపారు. రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల పైన ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఈ నెల 12 నుంచి నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా సోమవారం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం వద్ద ఈవో శ్రీనివాసులు రెడ్డి సహకారంతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రీ లక్ష్మి నరసింహ చారి మాట్లాడుతు బాల్య వివాహం సాంఘిక దురాచారమన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్స్ సిబ్బంది మనోహర్, ధర్మ తేజ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులు పునరావృతం కానీయొద్దు : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ అధికారులకు ఆదేశించారు.జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి ల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో ఎస్పీ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్లో మాట్లాడి బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారించి న్యాయపరమైన వాటికి సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు , పుట్టపర్తి డీఎస్పీ విజయ్ కుమార్, మహిళా పిఎస్ స్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

సిఐటియు నుంచి మాబున్నీసా తొలగింపు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

సిఐటియులో నాయకురాలుగా ఉంటూ యూనియన్ పద్ధతులకు భిన్నంగా, సంఘం విచ్చిన్నానికి పాల్పడుతున్న మాబున్నిసాను సంఘం నుంచి తొలగించినట్లు నాయకులు జి.ఎల్. నరసింహులు, జగన్మోహన్ తెలిపారు. యూనియన్ పద్ధతులకు భిన్నంగా వ్యవహరిస్తున్న మాబున్నీసాను సంఘం నుండి తొలగించాలని సోమవారం జరిగిన సిఐటియు పట్టణ కమిటీ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించిందన్నారు. ఇక నుండి మాబున్నిసాకు సిఐటియుకు ఎలాంటి సంబంధం లేదని వారు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఒడిసి విద్యార్థులు

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండల పరిధిలోని తంగేడు కుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన 10 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేష్ తెలిపారు. శనివారం అనంతపూర్ లోని అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల జరిగిన ఎన్నికలలో అండర్ 14 అండర్ 17 అండర్ 19 కు మొత్తం పదిమంది విద్యార్థులు పీప్ సైట్ ఓపెన్ సైట్ కేటగిరీలో ఎన్నికయ్యారన్నారు. వీరు త్వరలో రాజమండ్రి నందు జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు పాల్గొంటారని చెప్పారు. ప్రతిభా విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు తిరుపాల్, తదితరులు అభినందించారు.

ఆర్డీటీ ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - గాండ్లపెంట

ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్దరించాలని మండలంలోని సోమయాజులపల్లి గరుగుతాండ గాజులవారిపల్లి పెద్దతండ తుమ్మలబైలు పెద్ద తండా వేపరాల తదితర గ్రామాల ప్రజలు మహిళలు ర్యాలీ నిర్వహించారు. సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ర్యాలీతో నాలుగు రోడ్ల కూడలిలో ర్యాలీ నిర్వహించి స్పందన కార్యక్రమంలో వినతి పత్రాన్ని తహశీల్దార్ బి. బాబురావుకు అందజేశారు ఈ సందర్భంగా రాంప్రసాద్ నాయక్ సుధాకర్ నాయక్ వీరాంజనేయులు నాయక్ గంగోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మాణ పనులు నిలిపేయాలని వినతి

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువు మేజర్ గ్రామపంచాయతీలోని కమ్మ పాలెంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఎయిర్‌టెల్ సెల్ టవర్ నిర్మాణ పనులు నిర్వహిస్తున్నారని వాటిని వెంటనే నిలిపివేయాలని ఆ ప్రాంత ప్రజలు. దామోదర్ నాయుడు, మంజునాథ్, కిరణ్, శ్రీనివాసులు తదితరులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక తహశీల్దార్ బాలాంజనేయులు, ఎంపీడీవో కార్యాలయంలో ఏవో ఆంజనేయులు, మేజర్ గ్రామపంచాయతీ లో కార్యదర్శి శ్రీనివాసరెడ్డికి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ టవర్ నిర్మాణ పనులు నివాసాలు ఉండే దగ్గర ఏర్పాటు చేస్తున్నారని వీటి ద్వారా రేడియేషన్ ప్రభావానికి చిన్నపిల్లలు పెద్దలు తీవ్ర అనారోగ్యానికి గురవుతారని అన్నారు. తక్షణమే వీటి నిర్మాణ పనులు నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవి ,రాజేష్, రాఘవ, రమేష్ ,లైటింగ్ రాము, అనిల్, హరి ,తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ వైద్యసేవలపై వైసిపిది దుష్ప్రచారం : టిడిపి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ఎన్‌టిఆర్ వైద్యసేవల విషయంలో కూటమి ప్రభుత్వంపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని ధర్మవరం టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. సోమవారం ధర్మవరం నియోజకవర్గంలోని పలువురికి పరిటాల శ్రీరామ్ సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం 10మందికి 9.95లక్షల రూపాయల విలువైన చెక్కులను శ్రీరామ్ అందజేశారు. ఈసందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవలు అందక ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారిని సీఎంఆర్ఎఫ్ ద్వారా ముఖ్యమంత్రి ఆదుకుంటున్నారన్నారు. అయితే గత కొన్ని రోజులుగా మెడికల్ కళాశాలల నిర్మాణాలు, ఎన్టీఆర్ వైద్య సేవల విషయంలో వైసిపి దుష్ప్రచారం చేస్తోందన్నారు. ఇలాంటి ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు పరిసే సుధాకర్, నాయకులు సందా రాఘవ, చింతలపల్లి మహేష్ చౌదరి, నాగూర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిన మెగా డీఎస్సీ : టిఎన్ఎస్ఎఫ్

ప్రజాశక్తి కదిరి అర్బన్

కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ చరిత్రలో నిలుస్తుందని టిఎన్ఎస్ఎఫ్ నాయకులు అన్నారు. కూటమి ప్రభుత్వం 16,347 పోస్టులు భర్తీ చేయడం అభినందనీయమని బీఎస్సీ ద్వారా ఉద్యోగం పొందిన లబ్ధిదారులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. టిఎన్ఎస్ఎఫ్ జిల్లా నాయకులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.సత్య సాయి టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె పి.సల్మాన్ ఖాన్ మాట్లాడుతూ మెగా డీఎస్సీతో నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత తనకల్లు మండల అధ్యక్షులు కావడి ప్రవీణ్ కుమార్ తెలుగు యువత జిల్లా నాయకుడు ముద్దంశెట్టి శివకుమార్, జిల్లా అధికార ప్రతినిధి రోషన్, టిఎన్ఎస్ఎఫ్ కదిరి పట్టణ అధ్యక్షుడు అనిల్ , మధు, రాజు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలోకి మురుగునీరు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

స్థానిక బాలుర ప్రభుత్వ పాఠశాల ఆవరణంలోకి మురుగునీరు చేరుతుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగుకాలువ నీటిని పాఠశాల ఆవరణంలోకి వదులుతుండటంతో అక్కడ వచ్చే వాసన, నీటి నిలువ వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఈ సమస్యను పరిష్కరించాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్దన్న, పక్కీరప్ప, బాబ్జాన్, నౌషాద్ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కదిరి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కదిరి టౌన్

కర్నూల్‌లో 12 వ జాతీయ స్థాయి కరాటే పోటీలు గోజురియో కరాటే మార్షల్ ఆర్ట్స్ ఆర్గనైజర్ జగదీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలలో సుమారు 700 మంది క్రీడాకారులు పాల్గొనిప్రతిభ చాటారు .ఈ పోటీలలో కదిరి షాకీర్ మాస్టర్ షకీర్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థిని విద్యార్థులు కరాటే లో కట, కుమితే విభాగాలలో తమ అద్భుతమైన క్రీడాను ప్రదర్శించారు. ఈ పోటీలలో 30 విద్యార్థిని విద్యార్థులు 44 విభాగలలో పోటీచేయగా 14 బంగారు పతకాలు,14 వెండి పతకాలు 12 కాంస్య పతకాలు మొత్తం 40 పతకాలు సాధించారు.

అర్జీదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ దారులు సమర్పించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఇన్‌ఛార్జి డీఆర్వో సూర్యనారాయణ రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో ఆయనతో పాటు ఆర్డీవో సువర్ణ, డిపిఒ సమతా ఇతర అధికారులు పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ కలెక్టరేట్ లో అర్జీలు ఇస్తే తమ సమస్యలు పరిష్కరిస్తామని ఎంతో ఆశతో వ్యయ ప్రయాసలకోర్చి ప్రజలు అర్జీలు సమర్పిస్తారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.